



మాడుగులలో కురుస్తున్న వర్షం

పరిహారం లేదు.. ప్యాకేజీ లేదు!

వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని పూడిమడక మత్స్యకారుల ఆవేదన

- ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న పాతిక కుటుంబాలు
- జగనన్న కాలనీ కోసం ఖాళీ చేయాలని నాడు అధికారులు, వైసీపీ నేతలు హుకుం
- నష్టపరిహారం, ప్యాకేజీ ఇస్తామని హామీ
- ఇళ్లను ఖాళీ చేసిన మత్స్యకారులు.. వెంటనే కూల్చివేత
- జగనన్న కాలనీ ఏర్పాటు, లబ్ధిదారులకు స్థలాలు కేటాయింపు
- నిర్వాసితులకు అందని పరిహారం సొమ్ము, ప్యాకేజీ
- కాలనీలో కనీసం ఇంటి స్థలం కూడా ఇవ్వలేదని ఆవేదన



జగనన్న కాలనీ కోసం సామాన్లు బయటపడేసి కూల్చి వేసిన పెంకుటిల్లు వద్ద బాధితులు (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం, సెప్టెంబరు 6:

పేదలకు ఇళ్ల కాలనీ కోసం గత వైసీపీ ప్రభుత్వం తమ స్థలాలను తీసుకుని, ఇచ్చిన హామీలను అమలుచేయకుండా తీవ్ర అన్యాయం చేసిందని పూడిమడకకు చెందిన పలువురు బాధితులు వాపోతున్నారు. జగనన్న కానీ కోసం భూమి కావాలని, పరిహారంతోపాటు ప్యాకేజీ ఇస్తామంటూ ఆర్‌అండ్‌బీ, ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు.. 25 కుటుంబాల నుంచి భూమిని సేకరించారు. పరిహారం అంచనాలు రూపొందించి, ఎవరికి ఎంతెంత పరిహారం వస్తుందో లెక్కలుగట్టి చెప్పారు. పరిహారంతోపాటు ప్యాకేజీలో భాగంగా పక్కా ఇళ్లు కూడా ఇస్తామన్నారు. అధికారుల మాటలు నమ్మి స్థలాలను ఇచ్చేశారు. కానీ ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు సరికదా... కాలనీలో ఇళ్లు కూడా మంజూరు చేయలేదు. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

పూడిమడక రెవెన్యూ లోవపాలెం రోడ్డులో సర్వే నంబరు 123లో ప్రభుత్వ భూమి వుంది. ఇక్కడ సుమారు పాతిక కుటుంబాలకు చెందిన మత్స్యకారులు (అగ్నికుల క్షత్రియులు) తాత ముత్తాల కాలం నుంచి కమ్మల పాకలు, రేకుల షెడ్లు వేసుకుని నివాసం వుంటున్నారు. రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు వున్నాయి. పంచాయతీకి ఏటా ఇంటి పన్ను కూడా చెల్లిస్తున్నారు.

ఈ నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వం సర్వే నంబరు 123లో వున్న ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని భావించింది. ఈ భూమి ప్రభుత్వానికి కాబట్టి వెంటనే ఖాళీ చేయాలని అధికారులు, వైసీపీ నాయకులు కలిసి నివాసితులకు హుకుం జారీ చేశారు. దీంతో స్థానికులు ససేమిరా అన్నారు. రెండు, మూడు తరాల నుంచి ఇక్కడే ఉంటున్నామని, పంచాయతీకి ఇంటి పన్ను చెల్లిస్తున్నామని, పంచాయతీ అధికారులు ఇచ్చిన డోర్ నంబరు, చిరునామాతోనే రేషన్ కార్డులు, విద్యుత్ కనెక్షన్లు వున్నాయని, ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు కూడా పొందుతున్నామని చెప్పారు. అందువల్ల ఈ స్థలాన్ని ఖాళీ చేసేది లేదని స్పష్టం చేశారు. దీంతో తమ హెచ్చరిక పాచికలు పారలేదని భావించిన వైసీపీ నాయకులు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, ఏపీఐఐసీ అధికారులు... ఇళ్లకు నష్టపరిహారంతోపాటు ఆర్‌ఆర్ ప్యాకేజీలో ఇళ్లు కేటాయిస్తామని నమ్మబలికారు. వీరి హామీలు నిజమేనని నమ్మిన

... మిగతా 6వ పేజీలో

దంచికొట్టిన వాన!

పలు మండలాల్లో భారీ వర్షం

మళ్లీ పొంగిన శేషుగెడ్డ

- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాయగా, ఆ తరువాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పాయకరావుపేట, నక్కపల్లి, ఎలమంచిలి, మాడుగుల ప్రాంతాల్లో భారీ వర్షం పడగా, అనకాపల్లి, రాంబిల్లి, రావికమతం, గొలుగొండ, సబ్బవరం, ఎస్.రాయవరం మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. అనకాపల్లి, సబ్బవరం మండలాల్లో పిడుగులు పడి ఇద్దరు మృతిచెందారు.

ఎలమంచిలిలో గంటకుపైగా భారీ వర్షం కురిసింది. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో కాలువలను తలపించాయి. 30 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నివాస ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో నీరు చేరింది. పాయకరావుపేటలో సుమారు రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయంకాగా, మెయిన్‌రోడ్డులోని పల్లపు ప్రదేశాలు చెరువులను తలపించాయి. డ్రైనేజీలు పొంగి రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. నక్కపల్లి మండలంలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ మూడు గంటలపాటు వర్షం కురిసింది. 37 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. మాడుగుల మండలంలో శుక్రవారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. వాగులు, గెడ్డల్లో వరదనీరు ప్రవహించింది. విద్యుత్ సరఫరాకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. రాంబిల్లి మండలంలోని పలుగ్రామాల్లో అరగంటపాటు మోస్తరు వర్షం కురిసింది. రాంబిల్లి-వెంకటాపురం, సంతపాలెం-పెదకలవలాపల్లి, జంగాలపాలెం జంక్షన్-అప్పారాయుడుపాలెం రోడ్లలో ఏర్పడిన గోతుల్లో నీరు చేరి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. గొలుగొండ మండలంలో కృష్ణాదేవిపేట, చుట్టుపక్కల గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది.



పాయకరావుపేటలో వర్షం..



ఎలమంచిలిలో పాత జాతీయ రహదారి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న శేషుగెడ్డ వరద

- పాత హైవేపైనుంచి ఉధృతంగా ప్రవహించిన వరద నీరు
- మూడు గంటలపాటు నిలిచిన వాహనాల రాకపోకలు



శేషుగెడ్డ పొంగడంతో నిలిచిన వాహనాలు

ఎలమంచిలి, సెప్టెంబరు 6:

ఎలమంచిలి పట్టణంలో శేషుగెడ్డ మరోసారి పొంగింది. శుక్రవారం గంటపాటు కురిసిన భారీ వర్షానికి శేషుగెడ్డకు వరద పోటెత్తి పాత జాతీయ రహదారిపై ఉధృతంగా ప్రవహించింది. దీంతో ముందు జాగ్రత్తగా పోలీసులు సుమారు మూడు గంటలపాటు వాహనాలు, పాదచారుల రాకపోకలను నిలిపివేశారు.

ఎలమంచిలి ఎగువ ప్రాంతంలోని పెదపల్లి అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు శేషుగెడ్డ మీదుగా ప్రవహిస్తుంది. ఎలమంచిలి పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద పాత జాతీయ రహదారి వద్ద శేషుగెడ్డ కాజ్‌వే తక్కువ ఎత్తులో వుండడంతో గెడ్డ పొంగినప్పుడల్లా వరద నీరు రోడ్డు మీదు గా ప్రవస్తున్నది. వరద ఉధృతి ఎక్కువగా వుంటే వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. శుక్రవారం కూడా ఇదే తరహాలో శేషుగెడ్డ పొంగడంతో వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. దీంతో పలువురు వాహనదారులు వెనక్కు వెళ్లి బైపాస్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఆర్‌అండ్‌బీ జేఈ ఎం.సత్యవాణి.. శేషుగెడ్డ వద్దకు వచ్చి పరిశీలించారు. శేషుగెడ్డపై కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించాలని ఎన్నో ఏళ్ల నుంచి విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికా రులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా వంతెన నిర్మాణం గురించి ఆర్‌అండ్‌బీ జేఈ సత్యవాణిని 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా, మినీ వంతెన నిర్మాణానికి రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపామని చెప్పారు.

మార్కెట్‌లో చవితి సందడి



వినాయక పూజా సామగ్రి కొనుగోలుదారులతో సందడిగా మారిన అనకాపల్లి నెహ్రూచౌక్

వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో మార్కెట్లు రద్దీగా మారాయి. పత్రి, పూలు, పండ్లు, వినాయక ప్రతిమలను కొనుగోలు చేయడానికి భక్తులు తరలి రావడంతో అనకాపల్లిలో నెహ్రూచౌక్, చిననాలుగురోడ్ల జంక్షన్, చింతావారివీధి, పెరుగుబజార్, ఉడ్‌పేట, నర్సీపట్నంలో మెయిన్ రోడ్డు, అబీద్ సెంటర్, తదితర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



నర్సీపట్నంలో పత్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

నీరు-చెట్టు బకాయిలు విడుదల

ప్రస్తుతం రూ.3.49 కోట్లు..

- కోర్టుకు వెళ్లిన వారికి తొలి ప్రాధాన్యం
- 2014-19 మధ్య ఉమ్మడి జిల్లాలో రూ.44.5 కోట్లతో 715 పనులు
- బిల్లులు పెండింగ్‌లో పెట్టిన వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వం రాకతో మంజూరు

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం ప్రభుత్వ హయాం(2014-2019)లో నీరు-చెట్టు పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి కూటమి ప్రభుత్వం తాజాగా రూ.3,49,67,926 మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. బిల్లుల కోసం కోర్టుకు వెళ్లిన వారికి తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. కోర్టుకు వెళ్లినా గత ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడంతో కొందరు హైకోర్టులో ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేశారు. కోర్టు ధిక్కారణ పిటిషన్లు వేసిన వారికి తొలుత బిల్లులు ఇవ్వాలని, తదుపరి కోర్టును ఆశ్రయించిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా చోడవరం కేంద్రంగా పనిచేస్తున్న వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ డివిజన్‌లో 15 పనులకు సంబంధించి కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేసిన ఏడుగురికి రూ.1,13,28,113, కోర్టును ఆశ్రయించిన మరో ఐదుగురికి రూ.37,26,309 విడుదల చేశారు. అలాగే నర్సీపట్నం రెగ్యులర్ డివిజన్ పరిధిలో 19 పనులకు కోర్టు ధిక్కారణ పిటిషన్లు చేసిన ఎనిమిది మందికి రూ.1,50,54,422, పాడేరు చిన్ననీటి పారుదల డివిజన్ పరిధిలో రెండు పనులకు సంబంధించి

... మిగతా 6వ పేజీలో

బెల్లం వినాయకుడు సిద్ధం

మండపాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చిన విశాఖ పోలీస్ కమిషనర్



జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో గల గాజువాక ఆర్టీసీ డిపో పక్కనున్న ఏపీఐఐసీకి చెందిన స్థలంలో స్థానిక లంబోదర ట్రస్ట్ నిర్వాహకులు 75 అడుగుల ఎత్తు, 24 అడుగుల వెడల్పు కలిగిన బెల్లం వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఇందుకు 20 టన్నుల బెల్లం వినియోగించారు. ఈ మండపాన్ని శుక్రవారం రాత్రి నగర పోలీస్ కమిషనర్ శంకబ్రతబాగ్చీ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులకు ఆయన సూచించారు. ప్రత్యేకంగా వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపం వద్ద బందోబస్తు ఎక్కువగా ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు.

- మల్కాపురం

ఫిషింగ్ హార్బర్‌కు డీపీఆర్ రెడీ

- సర్వే చేసి.. నివేదిక ఇచ్చిన బెంగళూరుకు చెందిన సీఐసీఈఎఫ్
- నిర్మాణ పనులకు త్వరలో టెండర్



పూడిమడకలో పర్యటిస్తున్న బెంగళూరుకు చెందిన సీఐసీఈఎఫ్ బృందం (ఫైల్)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. రూ.387 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులకు గత నెల 30వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన విషయం విదితమే. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ బాధ్యలను చేపట్టిన బెంగళూరుకు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజనీరింగ్ ఫర్ ఫిషరీస్ (సీఐసీఈఎఫ్) బృందం గత నెల 20వ తేదీన పూడిమడకలో పర్యటించి ప్రాథమిక సమాచారాన్ని సేకరించి వెళ్లింది. ఈ బృందం మళ్లీ ఇటీవల ఇక్కడకు వచ్చి సమగ్ర సర్వే జరిపింది. వాస్తవానికి పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని ఎనిమిదేళ్ల కిందట అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సంస్థతో సర్వే చేయించింది. ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ఈ ప్రాంతం అనుకూలమని, రూ.350 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ నాలుగేళ్లపాటు ఫిషింగ్ హార్బర్ గురించి పట్టించుకోలేదు. ఏడాది కిందట ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ.387 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని మారిటైమ్ బోర్డుకు అప్పగించారు. ఒక కాంట్రాక్టు సంస్థకు టెండర్ ఖరారైనప్పటికీ నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. రాష్ట్రంలో మూడు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. పూడిమడక ఫిషింగ్ హార్బర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయా రీ బాధ్యలను బెంగళూరుకు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజనీరింగ్ ఫర్ ఫిషరీస్ (సీఐసీఈఎఫ్)కు అప్పగించింది. ఈ బృందం గత నెల 20వ తేదీన పూడిమడకలో పర్యటించి ప్రాథమిక సమాచారాన్ని సేకరించింది. హార్బర్ నిర్మాణ పనులకు గత నెల 30న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. సీఐసీఈ ఎఫ్ బృందం ఇటీవల మరోసారి పూడిమడక వచ్చి, హార్బర్ నిర్మించాల్సిన ప్రాంతాన్ని పరిశీలించింది. ప్రభుత్వానికి డీపీఆర్ అందజేసింది. త్వరలోనే మళ్లీ టెండర్లు పిలిచి, తక్కువకు కోట్ చేసిన కంపెనీతో ఒప్పందం చేసుకోనున్నట్టు మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

పిడుగులు పడి ఇద్దరి మృతి

- భూపతిపాలెంలో రైతు, గొల్లలపాలెంలో మహిళా వ్యవసాయ కూలీ...

కొత్తూరు (అనకాపల్లి), సబ్బవరం సెప్టెంబరు 6:

జిల్లాలో అనకాపల్లి, సబ్బవరం మండలాల్లో శుక్రవారం మధ్యాహ్నం పిడుగులు పడి ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. వీరిలో ఒకరు రైతుకాగా, మరొకరు వ్యవసాయ కూలీ. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. అనకాపల్లి మండలం కోడూరు పంచాయతీ భూపతిపాలెం గ్రామానికి చెందిన రాకోటి అర్జునరావు (63) రోజూ మాదిరిగానే శుక్రవారం కూడా పశువులను మేతకు తోలుకెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ సమయంలో అర్జునరావుపై పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని భార్య నల్లమారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి రూరల్ ఏఎస్ఐ ఎస్.భాస్కరరావు తెలిపారు.



అర్జునరావు (ఫైల్)



రాములమ్మ(ఫైల్)

సబ్బవరం మండలం గొల్లలపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ వంగలపూడి రాములమ్మ (55) శుక్రవారం పొలంలో పనులు చేస్తుండగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పిడుగు పడింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈమె భర్త, ఇద్దరు పిల్లలు వున్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 6 : మండలంలోని నామవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. నామవరం గ్రామానికి చెందిన కోన అప్పారావు (69) శుక్రవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో అక్కడి చర్చి వద్ద నుంచి తుని సైకిల్‌పై వెళుతున్నాడు. ఇంతలో నక్కపల్లి నుంచి తుని వైపు వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమార్తె కుంట్ల భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఉపాధి కూలీకి తీవ్ర గాయాలు

- పరిస్థితి విషమం

పరవాడ, సెప్టెంబరు 6 : విద్యుత్ షాక్‌కు గురై ఉపాధి హామీ పథకం కూలీ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. మండలంలోని తానాం గ్రామానికి చెందిన చీపురుపల్లి అప్పారావు (58) ఉపాధి కూలీగా పనిచేస్తున్నాడు. క్లీన్ ఆంధ్రా- గ్రీన్ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక కంసాలి చెరువులో ఇటీవల నాటిన కొబ్బరి మొక్కలకు శుక్రవారం అతడు కంచె ఏర్పాటు చేస్తున్నాడు. చెరువు పై నుంచి ఎగువ సీలేరు- పెందుర్తి వరకు 220 కేవీ విద్యుత్ టవర్‌లైన్ ఉంది. విద్యుత్ తీగలు కిందకు వేలాడి ఉండడంతో కొబ్బరి మొక్కలకు కంచె కడుతున్న అప్పారావుకు తగలడంతో 80 శాతం శరీరం కాలిపోయింది. వెంటనే స్థానికులు విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇదిలావుంటే, టవర్‌లైన్ విద్యుత్ తీగలు కిందకు వేలాడి ఉన్నాయని స్థానికులు గతంలోనే ఏపీ ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో ఈ సంఘటన చోటు చేసుకుందని పలువురు ఆరోపిస్తున్నారు. బాధితుడ్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

రాంబిల్లి, సెప్టెంబరు 6 : మండలంలోని వాడ నర్సాపురంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమ్మిడి మహాలక్ష్మి (55) అనే మహిళ మృతి చెందినట్టు సీఐ చిల్లా నర్సింగరావు తెలిపారు. రాత్రి ఏడు గంటల సమయంలో పాల ప్యాకెట్ కోసం గ్రామంలోని రోడ్డుపై నడిచి వెళ్తుండగా, కొత్తపట్నం వైపు నుంచి వచ్చిన ట్రాక్టర్ వెనుకనుంచి బలంగా ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలకు గురైన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామ సర్పంచ్ కారె రామారావు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

అనంతగిరి, సెప్టెంబరు 6: మండలంలోని ఎగువశోభ పంచాయతీ సరసపోదర్ గ్రామానికి చెందిన కొనేపు డొమ్ని (47) మృతి చెందారు. కమలపురం, జామిగుడ మధ్యలోని గెడ్డ దాటుతుండగా గురువారం డొమ్ని ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టగా గెడ్డ సమీపంలోని మృతదేహం లభ్యమైంది. అనంతగిరి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలోని గెడ్డ ఉధృతికి డొమ్ని కొట్టుకుపోయి ఉంటారని స్థానికులు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఎంపీపీ నీలవేణి డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ

అనకాపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ట్రాన్స్‌జెండర్ల పోర్టల్‌లో లాగిన్ అయి గుర్తింపు కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం ఇక్కడ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్, ఎస్పీలు వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ జగదీష్, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

ఉధృతంగా చెరువూరు వాగు

- అతికష్టం మీద వాగు దాటుతున్న ఆదివాసీలు
- వంతెన నిర్మించాలని వినతి


పిల్లలను భుజాలపై ఎత్తుకుని వాగు దాటుతున్న గిరిజనులు

చింతపల్లి, సెప్టెంబరు 6: గిరిజన ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఏవోబీలోని చెరువూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో శుక్రవారం ఆదివాసీలు చేయిచేయి పట్టుకుని, కర్రల సహాయంతో వాగు దాటారు. ఈ సందర్భంగా స్థానిక ఆదివాసీలు విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం చెరువూరు వాగు వద్ద బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదన్నారు. గతంలో ఈ వాగులో ఇద్దరు గిరిజనులు కొట్టుకుపోయి మృతి చెందారని, ఎనిమిది గ్రామాల గిరిజనులు నిత్యం వాగు దాటి రాకపోకలు సాగిస్తున్నారన్నారు. నిత్యవసర సరకులు తెచ్చుకునేందుకు, రోగులు, గర్భిణులను వాగు దాటించేందుకు అవస్థలు పడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి కృషిచేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిషరీస్ ప్రాసెసింగ్ హబ్‌గా భారత్

- టూనా చేపల ఎగుమతి కేంద్రంగా అండమాన్ దీవుల అభివృద్ధి
- కేంద్ర మత్స్య శాఖా మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్


సమావేశంలో పాల్గొన్న కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, పక్కన కేంద్ర సహాయ మంత్రి కురియన్

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని ఇంటర్నేషనల్ ఫిషరీస్ ప్రాసెసింగ్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ వెల్లడించారు. మత్స్య ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడానికి సంబంధిత రంగాల నిపుణులు, వ్యాపారులు, ఎగుమతిదారులతో విశాఖపట్నం నోవాటెల్ హోటల్‌లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో భారతదేశం రెండో స్థానంలో ఉందన్నారు. టూనా చేపల ఎగుమతి కేంద్రం అండమాన్, లక్ష దీవులను అభివృద్ధి చేస్తామని, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. లక్ష్య సాధన కోసం ఫిషరీస్ రంగాన్ని డిజిటలైజేషన్ చేస్తామన్నారు. రొయ్యల ఎగుమతులు మరింత పెంచడానికి న్యూక్లియస్ బ్రీడింగ్ సెంటర్లపై దృష్టిపెట్టామని, వీటి కోసం బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించామన్నారు. కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద ఐదు రోజుల క్రితమే 218 కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామన్నారు. మత్స్య రంగానికి గత ఏడాది కంటే ఈ ఏడాది 54 శాతం అధికంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారన్నారు. ఒక్క పీఎంఎస్ఎస్‌వై కిందే ఈ ఏడాది రూ.2,352 కోట్లు ఖర్చు చేయబోతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ ఇలియాస్, అధ్యక్షులు రవికుమార్ ఎల్లంకి, ప్రాన్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు పీఆర్ మోహన్‌రాజు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	88.00
లైవ్ ధర	108.00
విత్ స్కిన్	186.00
స్కిన్ లెస్	196.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494

అనకాపల్లి మార్కెట్‌కు చవితి శోభ

- పూజా సామగ్రి కొనుగోలుకు భారీగా జనం రాక
- ఎటుచూసినా కోలహల వాతావరణం
- ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు బందోబస్తు


నెహ్రూచౌక్‌లో పూజా సామగ్రి కొనుగోలుకు తరలి వచ్చిన జనం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6: వినాయక చవితి సందర్భంగా అనకాపల్లి మార్కెట్ కిటకిటలాడింది. శుక్రవారం జరగనున్న ఈ వేడుకల్లో స్వామికి పూజలు నిర్వహించేందుకు సామగ్రి కొనుగోలుకు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది.


వినాయక విగ్రహాల అమ్మకాలు

నెహ్రూచౌక్, చిన నాలుగురోడ్ల జంక్షన్, చింతావారి వీధి, పెరుగుబజార్, ఉడ్‌పేట తదితర ప్రాంతాల్లో పూజా సామగ్రి అమ్మకాలు ఊపందుకున్నాయి. వినాయక విగ్రహాలు, పత్రులు, పాలవెల్లి, పువ్వులు, పసుపు కుంకుమలు, కొబ్బరికాయలు, వివిధ రకాల పండ్లు తదితరాలు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది వినాయక విగ్రహాల ధరలు కొద్దిగా పెరిగాయని చెపుతున్నారు. మిగతా పూజా సామగ్రి ధరలు అందుబాటులోనే ఉన్నాయని అంటున్నారు. ఇదిలావుంటే, మార్కెట్‌కు భారీగా జనం రావడంతో పలు రహదారులు రద్దీగా మారాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ఎక్కడికక్కడ బందోబస్తు నిర్వహించారు.

పంచాయతీ నిధులు పక్కదారిపై విచారణ

- సర్పంచ్ గైర్హాజరు

మాకవరపాలెం, సెప్టెంబరు 6: మండలంలోని జి.కోడూరు పంచాయతీలో నిధులు పక్కదారి పట్టాయంటూ ఫిర్యాదు అందడంతో శుక్రవారం విచారణ చేపట్టారు. వీధిలైట్లు, పారిశుధ్యంకు సంబంధించిన, అలాగే 14, 15 ఆర్థిక సంఘాల నిధులు దుర్వినియోగం అయినట్టు స్థానిక టీడీపీ నాయకుడు మళ్ల జగన్నాథరావు (జయరాం) ఇటీవల రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీపీవో విచారణకు ఆదేశించారు. సబ్బవరం ఈవోపీఆర్డీ మహేష్ ఆధ్వర్యంలో పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం మాకవరపాలెం ఎంపీడీవో సీతామహాలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ సర్పంచ్ అనారోగ్యంతో ఉండడంతో హాజరు కాలేనని చెప్పారన్నారు. ఆయన గైర్హాజరు కావడం ఇది రెండోసారి అని తెలిపారు. దీంతో శుక్రవారం పంచాయతీ రికార్డులను తనిఖీ చేశామని, చివరిసారిగా సర్పంచ్‌ను విచారణకు పిలుస్తామని చెప్పారు. అనంతరం రిపోర్టును ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు వెల్లడించారు.


జి.కోడూరు సచివాలయంలో విచారణ చేస్తున్న అధికారులు

విజయవాడ వరద బాధితులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు తరలింపు



వ్యాన్‌లో బయలుదేరిన సామగ్రి, వాటర్ బాటిళ్లు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6: విజయవాడలో వరద ముంపునకు గురైన బాధితులకు రెవెన్యూ అధికారులు గురువారం రాత్రి నిత్యావసర సరకులను ఇక్కడి నుంచి పంపించారు. తుఫాన్ బాధితుల సహాయార్థం పలువురు దాతల సహాయ సహకారాలతో ఐదు లక్షల రూపాయల విలువైన పాల ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, నిత్యావసర సరుకులను ఆర్డీవో చిన్నికృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో రెండు వాహనాల్లో విజయవాడకు పంపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

లారస్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలు పంపిణీ

అచ్యుతాపురం, సెప్టెంబరు 6: ఎస్ఈజెడ్‌లో గల లారస్ కర్మాగారం ఆధ్వర్యంలో శుక్రవారం సెజ్ పునరావాస కాలనీలో సుమారు రెండు వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. సంస్థ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) మెహర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారావు చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను అంతా ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ.. అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.


సెజ్ పునరావాస కాలనీలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న సంస్థ జీఎం మెహర్ కుమార్

నిండుకుండలా కోనాం

- ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరిక
- గేట్లు ఎత్తి 1,900 క్యూసెక్కులు విడుదల


కోనాం స్పిల్‌వే గేట్ల ద్వారా వెళుతున్న వరద నీరు

చీడికాడ, సెప్టెంబరు 6: మండలంలోని కోనాం జలాశయానికి భారీగా వరద పోటెత్తింది. దీంతో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. జలవనరుల శాఖ అధికారులు ప్రాజెక్టు స్పిల్‌వే గేట్లను ఎత్తి అదనపు నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. కోనాం రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, పరివాహక ప్రాంతమైన పాడేరు, హుకుంపేట, అనంతగిరి మండలాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయంలోకి శుక్రవారం 1,800 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. దీంతో నీటి మట్టం 99.4 మీటర్లకు చేరింది. జలవనరుల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా స్పిల్‌వే గేట్లను ఎత్తి 1,900 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు సమాచారం పంపినట్టు ఏఈ జైరామ్ తెలిపారు.

త్వరలోనే అనకాపల్లిలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ప్రారంభం

కె.కోటపాడు, సెప్టెంబరు 6: మహిళ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ అనకాపల్లిలో త్వరలో ప్రారంభించనున్నట్టు సీడీపీవో వి.మంగతాయారు శుక్రవారం విలేకరులకు తెలిపారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల నుంచి అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఉద్యోగం చేసేందుకు వెళ్లే మహిళలు అనకాపల్లి హాస్టల్‌లో ఉండి ఉద్యోగం చేసుకోవడానికి అంగీకారమైతే మీ వివరాలు ఐసీడీఎస్ ప్రాజెక్టు, కె.కోటపాడు ఆఫీస్‌కు అందజేయాలన్నారు. సమాచారం కోసం ఫోన్: 94910 51541కు సంప్రదించాలన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంగతాయారు

ఇన్‌శానిటేషన్ లెట్రిన్ వివరాలపై సర్వే : కలెక్టరు

అనకాపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-శానిటేషన్ లెట్రిన్ వివరాల సేకరణ కోసం సర్వే జరుగుతోందని కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-శానిటేషన్ లెట్రిన్ ఉంటే ఆ వివరాలను ఈనెల 10వ తేదీలోగా మున్సిపాలిటీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో తెలియజేయాలని ఆమె ప్రజలను కోరారు.

ఏఎస్పీ మోహనరావు బాధ్యతలు స్వీకారం



తుమ్మపాల, సెప్టెంబరు 6 : అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీగా ఎల్.మోహనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రిలో డీఎస్ఆర్ పీగా విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడికి విచ్చేశారు. తొలుత జిల్లా ఎస్పీ ఎం. దీపికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

న్యాయ విద్యార్థులకు సామాజిక బాధ్యత

- న్యాయ విశ్వవిద్యాలయం సదస్సులో వక్తలు

సబ్బవరం, సెప్టెంబరు 6 : న్యాయ విద్యార్థులకు సామాజిక బాధ్యత మెండుగా ఉండాలని బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.మోహన్ గోపాల్ అన్నారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్య సమకాలీన సమస్యలు, సవాళ్లు అంశంపై శుక్రవారం విద్యార్థులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. నాడు బ్రిటీష్ దురాగతాలతో పాటు సామాజిక నిబంధనలను సవాల్ చేయడంలో న్యాయవాదులు ముందున్నారని పేర్కొంటూ స్వాతంత్ర్య పోరాటం నాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. వాటికి విరుద్ధంగా నేటి విద్యార్థులు సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించడం కంటే, తమ వ్యక్తిగత లబ్ధి కొరకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. విద్య సమాజంలోని వివిధ దృక్కోణాలపై లోతైన అవగాహనను పెంపొందిస్తుందని వివరించారు. నల్సార్ అండ్ ఎన్ఎల్‌యూ ఢిల్లీ వ్యవస్థాపక చాన్సలర్ ప్రొఫెసర్ రణబీర్ సింగ్, బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ పరిశోధన డీన్ ప్రొఫెసర్ మృణాల్ సతీష్ మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు సమాజానికి జ్యోతులుగా మారాలని ఉద్బోధించారు. అనంతరం వక్తలను ఇక్కడి వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశ్ జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ సోమా భట్టాచార్య, ప్రొఫెసర్ మృనాల్ సతీష్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

టన్ను చాక్లెట్‌తో అయోధ్య రాముడి విగ్రహం



గాజువాక (విశాఖపట్నం), సెప్టెంబరు 6: విశాఖ నగర పరిధిలోని గాజువాక శ్రీనగర్‌లో 89 అడుగుల వినాయక విగ్రహం చెంతనే టన్ను చాక్లెట్‌తో రూపొందించిన అయోధ్య రాముడి విగ్రహం కూడా ఏర్పాటుచేస్తున్నారు. రెండు విగ్రహాలకు 23 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విపత్తుల సమయంలో వైసీపీ బురద రాజకీయాలు

- మాజీ ఎమ్మెల్సీ 'బుద్ద' ఆగ్రహం



అనకాపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో చేతనైన సాయం చేయాల్సింది పోయి వైసీపీ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శిస్తూ బురద రాజకీయాలకు తెర లేపారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మండిపడ్డారు. శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ విజయవాడకు 113 ఏళ్ల కిందట వరదలు వచ్చాయని, తరువాత మళ్లీ ఇటీవల వచ్చాయని తెలిపారు. వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం ముందుందన్నారు. కృష్ణలంక రిటర్నింగ్ వాల్ తామే కట్టామని వైసీపీ నేత జగన్ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవానికి రిటర్నింగ్ వాల్ నిర్మాణం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభిస్తే, మిగులు పనులు పూర్తిచేసి గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒడ్డిమెట్ట గణపతి ఆలయంలో ఉత్సవాలు


ఒడ్డిమెట్ట ఆలయంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి, సెప్టెంబరు 6: ఉత్తరాంధ్రలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటైన నక్కపల్లి మండలం ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఇక్కడున్న కొండపై స్వామివారు స్వయం వ్యక్తమయ్యారు. ఈ ఆలయానికి 120 ఏళ్లకుపైగా చరిత్ర ఉంది. ప్రస్తుతం దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఈ ఆలయ నిర్వహణ జరుగుతోంది. ఏటా వినాయక చవితి రోజున కాకినాడ, ఉమ్మడి విశాఖ జిల్లాల్లోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి విచ్చేసి దర్శించుకుంటుండడం ఆనవాయితీగా వస్తోంది. దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇక్కడే అక్షరాభ్యాసం చేయిస్తుంటారు. శనివారం నుంచి ఒడ్డిమెట్ట ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు. పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

వరద బాధితులకు విశాఖ ఫార్మాసిటీ రూ.10 లక్షలు విరాళం

పరవాడ, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విశాఖ ఫార్మాసిటీ రూ.10 లక్షలు విరాళాన్ని అందజేసింది. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.హరిప్రకాష్ అభ్యర్థన మేరకు రాష్ట్ర విపత్తు నివారణ సంస్థకు నెఫ్ట్ ద్వారా ఈ మొత్తాన్ని పంపించడం జరిగిందని విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధరభక్తి ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ కారణంగా ఏర్పడిన నష్టం ఎవరూ పూడ్చలేనప్పటికీ తమవంతు సాయంగా అందజేశామన్నారు. అలాగే, ఫార్మాసిటీ ఉద్యోగులు, స్థానిక కంపెనీ యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహాయం చేయాలని ఆయన కోరారు.

పోలీసుల కుటుంబాలతో ఎస్పీ సమావేశం



మృతిచెందిన పోలీసుల కుటుంబాల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ దీపిక

తుమ్మపాల, సెప్టెంబరు 6 : విధి నిర్వహణలో పలు కారణాలతో మృతి చెందిన 19 మంది పోలీసుల కుటుంబాల సభ్యులతో జిల్లా ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్, కారుణ్య నియమాకాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన కలెక్టర్‌కు నివేదించామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఏవో బి.శారదా, ఇన్‌స్పెక్టర్లు సతీష్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు మండలాల్లో భారీ వర్షం



నక్కపల్లిలో నిలిచిన వర్షపునీరు

పాయకరావుపేట/నక్కపల్లి/రాంబిల్లి, సెప్టెంబరు 6 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా పాయకరావుపేట,నక్కపల్లి, రాంబిల్లి తదితర మండలాల్లో రెండో రోజు శుక్రవారం కూడా భారీ వర్షం పడింది. సుమారు దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పులువచ్చి చిన్న చినుకులతో ప్రారంభమై భారీ వర్షం పడింది. దీంతో పాయకరావుపేటలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, మెయిన్‌రోడ్డులోని పల్లపు ప్రాంతాలు చెరువులను తలపించాయి. అలాగే, నక్కపల్లి మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ మూడు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఒక్కరోజులో 37.0 మి.మీ వర్షపాతం నమోదైంది. పంట పొలాల్లో నీరు ఎక్కువగా చేరింది. పలు గ్రామాల్లోని రహదారులపై వర్షపు నీరు ప్రవహించింది. నక్కపల్లి, ఉపమాక, ఎన్.నర్సాపురం, చందనాడ, కాగిత, పెదబోదిగల్లం, జానకయ్యపేట, వేంపాడు, అమలాపురం తదితర గ్రామాల్లో ప్రజలు వర్షం కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే విధంగా రాంబిల్లి మండలంలోనూ కుండపోతగా వర్షం పడింది. దీంతో రాంబిల్లి నుంచి వెంకటాపురం వెళ్లే నేవీ రోడ్డు, సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి వెళ్లే రోడ్డు, జంగాలపాలెం జంక్షన్ నుంచి అప్పారాయుడుపాలెం వెళ్లే రోడ్డులో ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



అచ్యుతాపురం జంక్షన్‌లో పూలు, పండ్ల దుకాణాల వద్ద రద్దీ



ఎస్.రాయవరం మండలం అడ్డ రోడ్డులో...

గణపయ్య పూజకు వేళాయె

- ప్రతి ఇల్లు శోభాయమానం ▸▸ వీధి వీధినా మండపాలు..
- వ్రత సామగ్రి కొనుగోలుకు వచ్చిన వారితో మార్కెట్లు కిటకిట
- చాలా చోట్ల వినాయక విగ్రహాలను పంపిణీ చేసిన నేతలు, అధికారులు



పాయకరావుపేటలో పూజా సామగ్రి విక్రయదారులు, కొనుగోలుదారులతో కోలాహలం



ఎలమంచిలిలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న జనసేన నేత సుందరపు సతీష్ కుమార్

అచ్యుతాపురం/పాయకరావుపేట/ఎస్.రాయవరం, సెప్టెంబరు 6 : వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని మార్కెట్లు శుక్రవారం సందడిగా మారాయి. శనివారం ఈ వేడుక జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే ప్రతి ఇంటిని శోభాయమానంగా తీర్చిదిద్దారు. వీధివీధినా మండపాలు ఏర్పాటయ్యాయి. ఏవీధి చూసినా విద్యుద్దీప కాంతులతో ధగధగలాడుతోంది. పిల్లలు, పెద్దల సందడితో ఆయా ప్రాంతాల్లో కోలాహల వాతావరణం నెలకొంది. సాధారణంగా ప్రతి శుక్రవారం అచ్యుతాపురంలో వారపు సంత జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు సెజ్ కర్మాగారాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు నిత్యావసర వస్తువుల కొనుగోలుకు వస్తారు. దీనికి వినాయక చవితి తోడుకావడంతో సంత జనాలతో నిండిపోయింది. స్వామి పూజకు అవసరమైన విగ్రహాలు, పూలు, పండ్లు, కొబ్బరికాయలు తదితరాల వ్యాపారం జోరుగా సాగింది. అలాగే, చవితి సందర్భంగా పాయకరావుపేటలోని మార్కెట్లు కిటకిటలాడాయి. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. పలు కూడళ్లలో పందిళ్లు వేశారు. అదే విధంగా ఎస్.రాయవరం మండలంలో మార్కెట్లు రద్దీగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా సామగ్రి కొనుగోలుకు పెద్ద సంఖ్యలో రావడంతో కిటకిటలాడాయి. అయితే అంతటా విగ్రహాలు, పూజా సామగ్రి ధరలు కాస్త ఎక్కువగానే ఉన్నప్పటికీ కొనుగోలుకు ఎవరూ వెనక్కి తగ్గలేదు. చాలాచోట్ల వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.

నేటి నుంచి నియోజకవర్గంలో 'జనవాణి'

- జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్

నక్కపల్లి, సెప్టెంబరు 6 : నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఈనెల ఏడో తేదీ నుంచి జనసేన తరఫున జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ తెలిపారు. శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని డిప్యూటీ సీఎం, హోం మంత్రి ద్వారా పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. ముందుగా శనివారం నక్కపల్లి జనసేన కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న జనసేన కార్యదర్శి బోడపాటి శివదత్

పార్టీ నాయకులు శానాపతి బాబూరావు, రంగా, గోవిందరావు, స్వామి, గణేశ్, అప్పలరాజు, బంగారి రాజు, లోవరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధివినాయక ఆలయ వార్షికోత్సవం

కశింకోట, సెప్టెంబరు 6 : మండల కేంద్రం కశింకోట కస్పావీధిలో సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే వీలా గోవింద సత్యనారాయణతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

బీసీ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి

కశింకోట, సెప్టెంబరు 6 : ఇక్కడి బాలుర వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ కోరారు. వసతి గృహంలో సమస్యలను విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లడంతో శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వేగి గోపీకృష్ణ, వేగి దొరబాబు, తాకాశి కృష్ణ, ఆడారి నర్సింగరావు, వేగి పవన్‌కుమార్, పాపారావు, దాడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో పారిశుధ్య పనులు పరిశీలన

కశింకోట, సెప్టెంబరు 6 : తాళ్లపాలెంలో పారిశుధ్య పనులను ఎంపీడీవో ఎ.రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి సత్యారావుకు సూచించారు. వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6 : జీవీఎంసీ 80వ వార్డు అరుంధతినగర్, బోయిగూడెం దోభీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు బీఎస్‌ఎంకే జోగినాయుడు హాజరై గర్భిణులకు నెలకు సరిపడా పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. కూటమి నాయకులు బొడ్డేడ మురళీ, మల్లేశ్వరరావు, రాముడు, గణేష్, అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, పద్మ, సంతోషిదేవి తదితరులు పాల్గొన్నారు.

దోమ తెరలు సమకూర్చిన 'వసంత కెమికల్స్'

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 6 : ఇక్కడి సెజ్‌లో గల వసంత కెమికల్స్ కర్మాగారం రెండున్నర లక్షల రూపాయల విలువైన వెయ్యి దోమ తెరలను సమకూర్చింది. వీటిని శుక్రవారం అనకాపల్లి ఆర్‌డీవో కార్యాలయానికి అందజేసినట్టు ఆ సంస్థ సీనియర్ మేనేజర్ రాఘవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీవో శశికళ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

తుమ్మపాల, సెప్టెంబరు 6 : ఇక్కడి విద్యుత్‌నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. తుమ్మపాలలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజు ప్రశాంతంగా సదరం క్యాంపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6 : పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో రెండో రోజు శుక్రవారం సదరం క్యాంప్ ప్రశాంతంగా జరిగింది. అనకాపల్లి, పరవాడ, చోడవరం మండలాలకు చెందిన దివ్యాంగులు హాజరయ్యారు. ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది తనిఖీలు చేశారు. 70 మందిని సదరం సర్టిఫికెట్లకు గుర్తించినట్లు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. క్యాంప్ జరుగుతున్న తీరు టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, డాక్టర్ కేకేవీపీ నారాయణరావు పరిశీలించారు.

'డైట్'లో ఇంజనీర్స్ డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6 : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజనీర్స్ డే పోస్టర్‌ను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జ్ఞాపకార్థం తమ కళాశాలలో ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా 'టెక్నోవా 2కె 24' నేషనల్ లెవల్ టెక్నికల్ కాంపిటేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ ఇందులో విజేతలకు ఆపిల్ ఐపాడ్, సామ్‌సంగ్ టాబ్ వంటి ఆధునిక పరికరాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి'

సబ్బవరం, సెప్టెంబరు 6 : గణేష్ ఉత్సవాలను ప్రజలంతా ప్రశాంతంగా ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన సబ్బవరంలో పర్యటించారు. పలు ప్రాంతాల్లో గణేష్ మండపాలను పరిశీలించిన అనంతరం సీఐ పిన్నింటి రమణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాల నిర్వాహకులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వినాయక నిమజ్జన ఘాట్ పరిశీలించిన జెడ్సీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6 : వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇక్కడి శారదా నది ఒడ్డున గల వినాయక నిమజ్జన ఘాట్‌ను శుక్రవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు పరిశీలించారు. ఇళ్లలో, మండపాల్లో చవితి వేడుకల అనంతరం భక్తులు ఆయా విగ్రహాలను నిమజ్జనానికి తెస్తారని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అక్కడి సిబ్బందికి సూచించారు. టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, ఏఈ సుమిత్ర, పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం రేపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6 : పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులకు ఈనెల ఎనిమిదో తేదీన ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నామని జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భర్నికాన సాయినాథరావు తెలిపారు. శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం రోడ్డులోని లక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం పది గంటలకు పురస్కారాలను ఇవ్వనున్నామన్నారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్ హాజరు కానున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు భర్నికాన నరసింహమూర్తి, సబ్బి శ్రీనివాస్, కరక సోమునాయుడు, పంచదార్ల సూరిబాబు, బంధం వెంకటరమణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6 : చెడు వ్యసనాలకు అంతా దూరంగా ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రాములమ్మ సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై శుక్రవారం ఇక్కడి ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపి తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ స్వాతి, న్యాయవాది జి.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం లేదు.. ప్యాకేజీ లేదు!

... 3వ పేజీ తరువాయి

మత్స్యకారులు.. ఇళ్లు ఖాళీ చేయడానికి అంగీకరించారు.

ఎవరెవరికి ఎంతెంత పరిహారం..

అంగ తాతారావు, అంగ అప్పలరాజు 160.11 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన రేకుల షెడ్డులో నివాసం వుంటున్నారు. వీరికి రూ.76,852.80 పరిహారం వస్తుందని అంచనావేశారు. అలాగే బొంగు కాసులుకి 325.25 చ.అ. విస్తీర్ణంలోగల రేకుల షెడ్డుకి రూ.78,120, గోడలు లేని కమ్మల పాక 59.05 చ.అ.ల్లో ఉన్నందున రూ.2952.50 వస్తుందని చెప్పారు. అంగ గంటాలరావుకి 120.77 చ.అ.ల్లో గోడలులేని కమ్మలపాకకు రూ.6642.35, 52.49 చ.అ. విస్తీర్ణంలో గల గోడలులేని పశువుల పాకకు 2624.50లు,, ఆడారి సాంబశివరావుకు 509.24 చ.అ.ల్లోగల పెంకుటింటికి రూ.1,90,659లు, అద్దంకిల గోవిందరాజులుకు 76.69 చ.అ.ల్లో గల పెంకుటింటికి రూ.28,713, చిప్పల ప్రభకు 92.03 చ.అ. విస్తీర్ణంలో పెంకుటింటికి రూ.34,456 పరిహారం వస్తుందని అంచనాలు వేశారు. మిగిలిన వారి ఇళ్లకు, పశువులశాలలకు అంచనాలు వేశారు. ఇళ్లను ఖాళీచేసిన వెంటనే పరిహారం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్థలాన్ని ఖాళీ చేయడానికి మత్స్యకారులు అంగీకరించారు. గంటల వ్యవధిలోనే ఇళ్లను ఖాళీ చేయించి, ఎక్సకవేటర్‌తో నివాసాలను కూల్చివేశారు. భూమిని చదును చేసి 'జగనన్న కాలనీ' పేరుతో పూడిమడకకు చెందిన పలువురు మత్స్యకారులకు ఇళ్ల స్థలాలు కేటాయిచారు. ఇళ్లను ఖాళీ చేసి భూమిని ఇచ్చిన వారికి మాత్రం తీరని అన్యాయం చేశారు. నాలుగేళ్లు దాటినప్పటికీ ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. జగనన్న కాలనీలో స్థలం, ఇళ్లు మంజూరు చేయలేదు. పరిహారం చెల్లింపు తమ పరిధిలో లేదంటూ రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, ఏపీఐఐసీ అధికారులు తప్పించుకుంటున్నారు.

నీరు- చెట్టు బకాయిలు విడుదల

... 3వ పేజీ తరువాయి

కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేసిన ఇద్దరికి రూ.27,57,533 విడుదల చేశారు.

ఉమ్మడి జిల్లాలో నీరు-చెట్టు కింద 2019 వరకు రూ.44.5 కోట్ల విలువైన 715 పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పనులకు బిల్లులు ఇవ్వలేదు సరికదా రెండు, మూడు పర్యాయాలు విచారణ చేపట్టింది. ఆ తరువాత కూడా బిల్లుల విషయం తేల్చకపోవడంతో పలువురు కోర్టుకు వెళ్లారు. బిల్లులు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో వారిలో ఎక్కువ మంది కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 89 పనులకు రూ.7.7 కోట్లు విడుదల చేసినా సీఎంఎఫ్ఎస్‌లో బిల్లులు పూర్తిగా రాలేదని చెబుతున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రావల్సి ఉంది. ఈ లోగా ప్రభుత్వం మారడంతో బిల్లుల విషయం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లగా అన్ని జిల్లాలకు కలిపి రూ.200 కోట్లు విడుదల చేయగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 41 పనులకు రూ.3.49 కోట్లు మంజూరుచేశారు. త్వరలో సొమ్ములు సంబంధిత కాంట్రాక్టర్ల ఖాతాకు జమ కానున్నాయి. మిగిలిన పనులకు త్వరలో నిధులు విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

టిడ్కో ఇళ్లలో వసతులు కల్పించాలి



ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొత్తూరు, సెప్టెంబరు 6 : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీలో ఉన్న టిడ్కో గృహాలలో మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన సదరు ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. ఐదేళ్ల క్రితం నిర్మించిన సుమారు 2400 ఇళ్లను ఎన్నికలకు ముందు హడావుడిగా రిజిస్ట్రేషన్లు చేసి అప్పగించారన్నారు. కాని ఇంత వరకు వాటిలో మౌలిక వసతులు కల్పించలేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే మంచినీరు, రహదారుల సౌకర్యాలు కల్పించాలన్నారు. పార్టీ నాయకులు ఎం.అప్పలరాజు, గంటా శ్రీరామ్, బొప్పె ఉమామహేశ్వరరావు, బుగిడి నూకఅప్పారావు ఉన్నారు.


నర్సీపట్నం : కోలాహలంగా మార్కెట్


మాడుగుల రూరల్ : భారీ విగ్రహాల వద్ద సందడి


రావికమతం : కొనుగోలుదారులతో కిక్కిరిసిన మార్కెట్

బజార్లలో వినాయకచవితి సందడి

వినాయక చవితి పండగ నేపథ్యంలో పలు ప్రాంతాల్లోని మార్కెట్లు కిటకిటలాడాయి. వినాయకుడు విగ్రహాలు, పత్రి, అరటిపండ్లు, కొబ్బరి కాయలు, పువ్వులు కొనేందుకు కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో రావడంతో దుకాణాలు కిక్కిరిసిపోయాయి. దీంతో దుకాణదారులు ఆయా సామగ్రి ధరలు విపరీతంగా పెంచేశారు. అయినప్పటికీ పూజ కోసం తప్పక కొనాల్సిందే కదా అంటూ ప్రజలు కొనుగోలు చేశారు.

నర్సీపట్నం, సెప్టెంబరు 6 : పట్టణంలోని అబీద్ సెంటర్‌లో పండగ శోభ సంతరించుకుంది. పత్రిరూ.30, కొబ్బరి కాయ రూ.30, అరటి పండ్లు రూ.80లు, మారేడు కాయలు, వెలక్కాయలు జత రూ.30, బంతి, చామంతి పువ్వుల పొట్లం కట్టి రూ.50లకు విక్రయించారు. ఇతర ప్రాంతాల నుంచి పత్రి పూజా సామగ్రి విక్రయించుకునే చిరు వ్యాపారుల నుంచి రోడ్ల మార్జిన్ ఆశీలును రూ.100 చొప్పున వసూలు చేశారు.

మాడుగుల : మాడుగుల కేంద్రంలో వినాయక చవితి సామగ్రి కొనేందుకు దుకాణాల వద్ద జనం కిక్కిరిశారు. ఇక్కడ పూజ కోసం, వినాయక మండపాల్లో డెకరేషన్ చేసేందుకు వివిధ సామగ్రిని పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. పండ్ల దుకాణాల వద్ద సందడి ఎక్కువగా కనిపించింది.

మాడుగుల రూరల్ : మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి సందడి నెలకొంది. మాట్లోడ్డు జంక్షన్‌లో వినాయక విగ్రహాలు, ప్రతిమల అమ్మకాలు జోరుగా సాగాయి. సుమారు నాలుగు అడుగుల వినాయకుడి విగ్రహం డిజైన్ బట్టి 5 వేలు నుంచి 7 వేలు పలికింది. తొమ్మిది, పది అడుగుల బొమ్మలు రూ.15 వేలు నుంచి రూ.20 వేల ధరలు పలికాయి. గిరిజన గ్రామాల్లోని యువకులు వినాయక బొమ్మలు కొనేందుకు వచ్చారు.

నాతవరం : వినాయక కమిటీ సభ్యులు శుక్రవారం ఉదయం నుంచే వినాయకుని మండపాల ఏర్పాటు చేసే పనులలో నిమగ్నమయ్యారు. బజార్లు కిటకిటలాడాయి.

దేవరాపల్లి : వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో మార్కెట్లు కిటకిటలాడాయి. దేవరాపల్లి మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారితో పాటు అనంతగిరి మండలానికి చెందిన నాలుగు పంచాయతీల నుంచి జనం వచ్చారు. గతంలో కన్నా బ్రవరం, అనకాపల్లి, చోడవరం, చౌడువాడ నుంచి వినాయకుడి భారీ విగ్రహాలను కొనుగోలు చేసేవారు. ఇప్పుడు దేవరాపల్లిలోనే లభ్యం అవుతుండడంతో జనం కొనుగోలుకు ఎగబడ్డారు.

రావికమతం : వినాయకచవితి పూజా సామగ్రి కోసం కొనుగోలుదారులు మార్కెట్లో కిక్కిరిశారు. ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ పూజా సామగ్రి కొనేందుకు పోటీలు పడ్డారు. ఇదే అదనుగా భావించిన దుకాణదారులు ఆయా సామగ్రి రేట్లను పెంచేశారు.

జీవో 115 ఉపసంహరణ కోరుతూ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల ఆందోళన

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 6 : ఏళ్ల తరబడి కాంట్రాక్టు స్టాఫ్ నర్సులుగా విధులు నిర్వహిస్తున్న తమను పక్కన పెట్టి ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చి స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి అవకాశం కల్పించిన 115 జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు డిమాండ్ చేశారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వద్ద వీరు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్టాఫ్‌నర్సుల సంఘం నాయకులు నాగమణి, ప్రశాంతి, అలివేణి తదితరులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 11,500 మంది కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు, ఎన్‌హెచ్ఎంలు ఆస్పత్రుల్లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న స్టాఫ్‌నర్సులను రెగ్యులర్ చేయకపోగా, సచివాలయ ఏఎన్ఎంలకు


ఆందోళన నిర్వహిస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు

జీఎన్ఎం శిక్షణ ఇచ్చి స్టాఫ్‌నర్సులుగా భర్తీ చేయటం దారుణమన్నారు. దీంతో తమకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు పద్మ, వరలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పంటల పరిశీలన


రైతులకు సూచలిస్తున్న భానుపుష్ప లీలావతి

రావికమతం, సెప్టెంబరు 6 : కూరగాయల పంటల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా రైతులు జాగ్రత్త పడాలని ఉద్యానవన అధికారి వి.భానుపుష్ప లీలావతి పేర్కొన్నారు. మండలంలోని తోటకూరపాలెం, గుడివాడ, గొంప గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న కాయగూరలు, ఆకుకూరల పంటలను ఆమె శుక్రవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. పంట మడుల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలన్నారు. రైతులు కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆమె అన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

రోలుగుంట, సెప్టెంబరు 6 : పొడి గేదెను రక్షించబోయి ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందిన జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన రైతు సుర్ల అప్పయ్యనాయుడు ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శుక్రవారం పరామర్శించారు. మృతుడి భార్య రామలక్ష్మిని ఓదార్చారు. రైతు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట గ్రామ మాజీ సర్పంచ్ రొంగలి రమణ, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్ములూరు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.


మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే రాజు

అంగన్వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 6 : రాజాం అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు శుక్రవారం తురకలపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్యారాణి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం సోకిన ఆశ్రిత చేయకుండా స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యసేవలు పొందాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. చిన్నపిల్లలకు సూచించిన మేరకు టీకాలు వేయించాలన్నారు. గర్భిణీలు, కిషోర్ బాలికలు, బాలింతలు క్రమం తప్పకుండా పోష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవం చేసుకోవాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు పుట్టుకతో ఆరోగ్య సమస్యలుంటే ఉచితంగా వైద్యం అందిస్తామని డాక్టరు సంధ్యారాణి అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

చోడవరం, సెప్టెంబరు 6 : స్థానిక వాసవీ క్లబ్, వనిత, యూత్ క్లబ్‌ల ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు వాసవీ క్లబ్ నేతలు ప్రకటించారు. శుక్రవారం స్థానిక వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ సేవ ప్రాకర్ మాట్లాడుతూ గ్రామాల్లోని పాఠశాలల్లో సైన్స్ క్లబ్‌లకు సహకారం, తాగునీటి సరఫరా యూనిట్లకు అవసరమైన చేయూత, పేదలకు సహాయ కార్యక్రమాలు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సామాజిక సేవా కార్యక్రమాలు మరింతగా విస్తృతం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవీ నేతలు కంచర్ల శేషు, పసుమర్తి మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని మొక్కుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

» అవగాహన కల్పించిన వివిధ సంస్థలు, సంఘాలు » పలు చోట్ల ప్రతిమల పంపిణీ » వెల్లివిరుస్తున్న సామాజిక చైతన్యం

ప్రజల్లో పర్యావరణ స్పృహ పెరిగింది. వినాయకచవితి నేపథ్యంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో రూపొందించిన గణేషుని ప్రతిమలు కాకుండా మట్టి వినాయకులనే పూజించేందుకు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణవేత్తలు, మేధావులు తదితరుల కృషి ఫలితమే ఈ శుభపరిణామం అని చెప్పాలి. వినాయక చవితి నేపథ్యంలో శుక్రవారం పలు చోట్ల మట్టి వినాయకులను వివిధ సంస్థలు, సంఘాలు ఉచితంగా పంపిణీ చేశాయి.


విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఆర్డీవో జయరాం, కౌన్సిలర్ రాజేశ్ తదితరులు

నర్సీపట్నం, సెప్టెంబరు 6 : పట్టణంలో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆర్డీవో జయరాం, కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ చేతుల మీదుగా 2000 మట్టి విగ్రహాలు, గణపతి వ్రతం పుస్తకం, పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. గ్రీన్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు డీజీపీ, ఆల్లు అప్పారావు, కరక రమణ, డి.అప్పలనాయుడు, డీటీఆర్ మూర్తి, ఆర్.శ్రీనివాసులునాయుడు, సుగుణ తదితరులు పాల్గొన్నారు. విద్యాంజలి స్కూల్ చైర్మన్ యక్కల ఆక్షితకృష్ణ, కరస్పాండెంట్ శాంతి ఆధ్వర్యంలో విద్యార్థులకు 1200 మట్టి విగ్రహాలు పంపిణీ ఏశారు. సిటీ క్లబ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్ రాజేశ్ చేతుల మీదుగా 2000 మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ప్రెసిడెంట్ పల్లా దొరబాబు, కార్యదర్శి పెదిరెడ్డి చింతు, కోశాధికారి బొంతు రమేశ్ పాల్గొన్నారు. రోటరీ ఆధ్వర్యంలో పద్మనాభుని రాయుడు, సుత్తావల్లి అప్పలరాజు, నాగేంద్రరాజు, ఆంతిశ సత్యనారాయణ మట్టి విగ్రహాలు పంపిణీ చేపట్టారు.

చోడవరం : పట్టణంలోని జెర్రిపోతుల రమణాజీ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెయ్యి వినాయకమట్టి విగ్రహాలనుఉచితంగా పంపిణీ చేశారు. కొత్తూరు జంక్షన్‌లో పెట్రోల్‌బంకు యజమాని, వాసవీ క్లబ్ నేత కంచర్ల శేషు 2 వేల మట్టి ప్రతిమలను ఉచితంగా అందజేశారు. లక్ష్మీపురం ఆర్చి సమీపంలో వ్యాపారి పసుమర్తి సంతోష్ గుప్తా ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

మాడుగుల : మాడుగుల బస్టాండ్ ఆవరణలో భారత నిర్మాణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై నారాయణ రావు చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. తమ ట్రస్టు ఆధ్వర్యంలో గత 12 ఏళ్లుగా మట్టి వినాయకుల ప్రతిమలను అందజేస్తున్నట్టు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ శ్రీనివాసరావు, సూర్యనారాయణరాజు, మండల సతీష్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

గొలుగొండ : చీడిగుమ్మలలో హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పర్యావరణంపై ర్యాలీ నిర్వహించారు. మట్టి గణపతులనే పూజించండని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఆనంద్, రాము, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : కొండలఅగ్రహారంలో శ్రీశారదాంబ ఎజెన్సీస్ ఆధ్వర్యంలో 200 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. బంక్ యజమాని కన్నూరి బంగారునాయుడుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో నేతాజీ పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులు పెట్టాలంటూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంఈవో ఉషారాణి, ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, మట్టి వినాయకుల్ని పంపిణీ చేశారు. సూర్యనారాయణ, మోరా అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

కోనాం పంచాయతీ పరిధిలో చేర్చండి

అధికారులకు బంధవీధి, కొత్తవీధి గ్రామస్థుల మొర


అధికారులకు సమస్యలను వివరిస్తున్న బంధవీధి పీటీజీలు

చీడికాడ, సెప్టెంబరు 6 : మండలంలోని కోనాం పంచాయతీలో బంధవీధి, కొత్తవీధి అనే పీవీటీజీ గ్రామాలు ఉన్నట్టు పంచాయతీ రికార్డుల్లో నమోదు చేయాలని ఆ రెండు గ్రామాల గిరిజన పీవీటీజీలు అధికారులను కోరారు. పీఎం జన్మన్ కార్యక్రమంలో భాగంగా ఈ రెండు గిరిజన పీవీటీజీల గ్రామంలో శుక్రవారం సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బంధవీధి గ్రామంలో ఉన్న తాగునీటి బోరు ప్లాట్‌ఫాం పగిలిపోయిందని అధికారులకు గిరిజనులు చూపించారు. అలాగే తాగునీటి సౌకర్యం లేక గెడ్డ నీటిని తాగుతున్నామని ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయని అధికారుల ముందు వాపోయారు. ఈ రెండు గ్రామాలకు రహదారి సౌకర్యం ఉన్నా పక్కా గృహాలు లేవని మంజూరు చేయాలని కోరారు. ఈ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయప్రకాశరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే పీఎం జన్‌మన్ ప్రధాన ధ్యేయమని ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని గర్భింగిలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. వెనక బడిన పీవీటీజీ గిరిజనులు అభ్యున్నతి ఈ గ్రామసభలు ఉపయోగపడతాయన్నారు. అలాగే అంగన్వాడీ పోష్టికాహార స్టాళ్లను ఏర్పాటు పరిశీలించారు. సర్పంచ్ గూడెపురాము తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల ఎదుట కార్మికుల ఆందోళన

చోడవరం, సెప్టెంబరు 6 : తమ సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రి కార్మికులు జిల్లా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి, మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు కెల లక్ష్మణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు తదితర ఉద్యోగులను దళారీల చేతుల్లో పెట్టడంతో సిబ్బందికి సకాలంలో వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంగ, నూకరత్నం, కోటిబాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆస్పత్రి వద్ద శుక్రవారం ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు నల్ల బ్యాడ్జీ ధరించి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అరుణ, దేవుడమ్మ, సత్యవతి, ఈశ్వరమ్మ, నాగేశ్వరరావు, అప్పలరాజు, శ్రీను పాల్గొన్నారు.

జనసేన చీడికాడ మండల అధ్యక్షునికి ఉద్వాసన

» పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు 'పంచకర్ల' నిర్ణయం

మాడుగుల రూరల్, సెప్టెంబరు 6 : జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడి ఆదేశానుసారం మాడుగుల నియోజకవర్గంలోని చీడికాడ మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గంటల మూర్తిని ఆ పదవి నుంచి తొలగించినట్టు మాడుగుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ తెలిపారు. శుక్రవారం మాట్లోడ్డు జంక్షన్‌లో గల జనసేన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గంటల మూర్తి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పంచకర్ల రమేశ్‌బాబు దృష్టికి రావడంతో ఆతడిని ఆ పదవి నుంచి తొలగించినట్టు చెప్పారు. ఏ స్థాయి నేత అయినా పార్టీ నియమనిబంధనలకు కట్టుబడి ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని కృష్ణ పేర్కొన్నారు. త్వరలో కొత్త చీడికాడ మండల పార్టీ అధ్యక్షుడిని నియమించనున్నట్టు చెప్పారు.

ఈ సమావేశంలో మండల, గ్రామస్థాయి జన సైనికులు గ్రిడ్డి శివాజీ, కోన శ్రీనివాసరావు, దాసరి అచ్యుతరావు, కుంద ఆదిబాబు, దాణక్య మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధారగంగవరంలో 'గ్రీన్ ఆంధ్రా - క్లీన్ ఆంధ్రా'

నాతవరం, సెప్టెంబరు 6 : నాతవరం మండలం వల్లంపేట పంచాయతీ శివారు ధారగంగవరంలో గ్రీన్ ఆంధ్రా క్లీన్‌ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జనసేన పార్టీ నాయకులు పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించారు. అనంతరం శ్మశాన వాటికలో తుప్పలను తీసివేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు ప్రగడ శ్రీను మాట్లాడుతూ ఆ నేత పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు.

రిషి కళాశాలలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

నర్సీపట్నం, సెప్టెంబరు 6 : స్థానిక రిషి విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహ వాతావరణంలో జరిగాయి. స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, సినిమా డ్యాన్సులతో ఉర్రూతలూగించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.సతీష్ మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగి, ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని సూచించారు. ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన కె.దుర్గాగాయత్రి (ఎంపీసీ), వి.ప్రణతి (బైపీసీ), రెడ్డి సత్యనారాయణ (సీఈసీ)లకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్వీ నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

నీరు-చెట్టు బకాయిలు విడుదల

... 3వ పేజీ తరువాయి

కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేసిన ఇద్దరికి రూ.27,57,533 విడుదల చేశారు.

ఉమ్మడి జిల్లాలో నీరు-చెట్టు కింద 2019 వరకు రూ.44.5 కోట్ల విలువైన 715 పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పనులకు బిల్లులు ఇవ్వలేదు సరికదా రికార్డు, మూడు పర్యాయాలు విచారణ చేపట్టింది. ఆ తరువాత కూడా బిల్లుల విషయం తేల్చకపోవడంతో పలువురు కోర్టుకు వెళ్లారు. బిల్లులు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో వారిలో ఎక్కువ మంది కోర్టు ధిక్కారణ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 89 పనులకు రూ.7.7 కోట్లు విడుదల చేసిన సీఎంఎఫ్ఎస్‌లో బిల్లులు పూర్తిగా రాలేదని చెబుతున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రావల్సి ఉంది. ఈలోగా ప్రభుత్వం మారడంతో బిల్లుల విషయం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లగా అన్ని జిల్లాలకు కలిపి రూ.200 కోట్లు విడుదల చేయగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 41 పనులకు రూ.3.49 కోట్లు మంజూరుచేశారు. త్వరలో సొమ్ములు సంబంధిత కాంట్రాక్టర్ల ఖాతాకు జమ కానున్నాయి. మిగిలిన పనులకు త్వరలో నిధులు విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

మాడుగులలో భారీ వర్షం

మాడుగుల, సెప్టెంబరు 6 : మాడుగుల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం మబ్బులు వేసి తేలికపాటి జల్లులు కురిశాయి. మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో వాతావరణం చిమ్మచీకటిగా మారి కుండపోత వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ పంటపొలాల్లోకి నీరు చేరడంతో పాటు లోతట్టు ప్రాంతాలు వర్షపునీటితో జలమయం మయ్యాయి.

మాడుగుల రూరల్ : మండలంలోని గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం పడింది. ఉదయం నుంచి పొడి వాతావరణం ఉన్నప్పటికీ సాయంత్రం నాలుగు గంటలకు ఆకాశంలో కారుమబ్బులు కమ్మి కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది. రోడ్లపై వర్షం నీరు పారింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో రోడ్లు చిత్తడిగా మారాయి.

పెద్దేరు జలాశయం నుంచి 200 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్, సెప్టెంబరు 6 : మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు జలాశయం గేటు తెరిచి 200 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టినట్టు ఏఈ సుదాకర్ రెడ్డి తెలిపారు. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు. ప్రస్తుతం 286 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో 135.85 మీటరకు చేరిందన్నారు. వర్షాలు కురుస్తున్నందున 200 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టి నీటిమట్టాన్ని క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు.

64 మందికి జాబ్ ఆఫర్స్ లెటర్స్

చోడవరం, సెప్టెంబరు 6 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు, హెటిరో ఫార్మా, అమెజాన్, కేఎల్‌గ్రూప్స్ వంటి కంపెనీలు హాజరయ్యాయి. 157 మంది ఇంటర్వ్యూలు నిర్వహించిన కంపెనీలు 64 మందికి జాబ్ ఆఫర్‌లెటర్లు అందించాయి.

పరిహారం లేదు.. ప్యాకేజీ లేదు!

... 3వ పేజీ తరువాయి

మత్స్యకారులు.. ఇళ్లు ఖాళీ చేయడానికి అంగీకరించారు.

ఎవరెవరికి ఎంతెంత పరిహారం..

అంగ తాతారావు, అంగ అప్పలరాజు 160.11 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు. వీరికి రూ.76,852.80 పరిహారం వస్తుందని అంచనావేశారు. అలాగే బొంగు కానుకలకు 325.25 చ.అ. విస్తీర్ణంలో రేకుల షెడ్డుకి రూ.78,120, గోడలు లేని కమ్మల పాక 59.05 చ.అ.లో ఉన్నందున రూ.2952.50 వస్తుందని చెప్పారు. అంగ గుటాలరావుకి 120.77 చ.అ.ల్లో గోడలులేని కమ్మలపాకకు రూ.6642.35, 52.49 చ.అ. విస్తీర్ణంలో గోడలు లేని పశువుల పాకకు 2624.50లు, ఆదారి సౌజశేషరావుకు 509.24 చ.అ.ల్లో గల పెంకుటింటికి రూ.1,90,659లు, ఆద్దంకిల గోవిందరాజులుకు 76.69 చ.అ.ల్లో గల పెంకుటింటికి రూ.28,713, చిప్పల ప్రభుకు 92.08 చ.అ. విస్తీర్ణంలో పెంకుటింటికి రూ.34,456 పరిహారం వస్తుందని అంచనాలు వేశారు. మిగిలిన వారి ఇళ్లకు, పశువులశాలలకు అంచనాలు వేశారు. ఇళ్లను ఖాళీచేసిన వెంటనే పరిహారం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్థలాన్ని ఖాళీ చేయడానికి మత్స్యకారులు అంగీకరించారు. గంటల వ్యవధిలోనే ఇళ్లను ఖాళీ చేయించి, ఎక్స్‌కవేటర్‌తో నివాసాలను కూల్చివేశారు. భూమిని చదును చేసి 'జగనన్న కాలనీ' పేరుతో పూడిమడకకు చెందిన పలువురు మత్స్యకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. కాలనీ కోసం ఇళ్లను ఖాళీ చేసి భూమిని ఇచ్చిన వారికి మాత్రం తీరని అన్యాయం చేశారు. నాలుగేళ్లు దాటినప్పటికీ ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదు. జగనన్న కాలనీలో స్థలం, ఇళ్లు మంజూరు చేయలేదు. పరిహారం చెల్లింపు తమ పరిధిలో లేదంటూ రెవెన్యూ ఆర్అండ్‌బీ, ఏపీఐఐసీ అధికారులు తప్పించుకుంటున్నారు.